

భూభారతి చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకం 4 లో


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :148 | బుధవారం 28 మే 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695




ఊరి బడిని కాపాడుకుందాం 3 లో

## భారత్ తో శాంతి చర్చలకు రెడీ..




● పహల్గాం దాడి తర్వాత దిగొచ్చిన పాక్ ● ఉగ్రవాదం, కాశ్మీర్, జలాలపై చర్చలకు సిద్ధం ● భారత్ తీరుతో మైండ్ బ్లాంక్ ● మేకపోతు గాంభీర్యం వీడి శాంతి పిలుపుతో పాక్ దిగొచ్చిందా? ● పీఓకే తప్ప చర్చలే లేవు అని భారత్ తేల్చి చెప్పిన తరుణంలో పాక్ శాంతి చర్చల ప్రస్తావన

# అలాగైతే రాజీనామా చేస్తా..




●ఊర్సా భూములపై ఆరోపణలు నిరూపిస్తే పదవి వదులుతా పైసలకు భూములు ఇచ్చారన్న ఆరోపణపై లోకేష్ ప్రతిసవాల్ ● ఐటీ పరిశ్రమలు, యువత ఉద్యోగాలు మా కృషిలో కీలకం: మంత్రి లోకేష్ ● మూడు నెలలకు ఒకసారి పార్టీ మీటింగ్‌లు -ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మార్గనిర్దేశం ● జూన్ 12లోగా నామినేటెడ్ పదవుల భర్తీ ● సీఎం పదవికి అంత తొందరేముంది -లోకేష్

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన సాగిస్తుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. తాజాగా మంత్రి లోకేష్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరిస్తా అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. సీఎం పదవికి అంత తొందరేముంది అన్నారు. జూన్ 12లోగా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని చెప్పారు. సరైన సమయంలో అందరికీ పదవులు వస్తాయి. మండల పార్టీ నుంచి జాతీయ స్థాయి వరకు వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ తెలిపారు. మూడు నెలలకు ఒకసారి మీటింగ్ పెట్టి.. ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం అన్నారు.

మిషన్ రాయలసీమకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను తరిమేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ కంపెనీలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ పై విమర్శలు గుప్పించారు. వైఎస్ జగన్ ఒక్క రోజు కూడా నిజాలు మాట్లాడటం లేదని దుయ్యబట్టారు.




## గుత్తాధిపత్యాన్ని సహించం

●టికెట్ ధరల పెంపు వ్యక్తిగతంగా కాదు -చలనచిత్ర మండలి ద్వారానే ● పాప్‌కార్న్ ధరలు చూసి ప్రేక్షకులు భయపడితే ఎలా? ● పానీయాల ధరలపై విచారణ జరపండి -సినిమాటోగ్రఫీ శాఖకు పవన్ సూచనలు ●హరిహర వీరమల్లు టికెట్లకు ప్రత్యేక రేటు కోరడం లేదు ● థియేటర్ల పారిశుధ్యం యజమానుల బాధ్యతే -డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




## కాళేశ్వరం విచారణకు కేసీఆర్

● జూన్ 5న విచారణకు హాజరు ● విచారణకు వెళ్లకుంటే తప్పుడు సంకేతాలు ● విచారణ ముందునే హరీష్‌రావుతో భేటీ -కమిషన్ ప్రశ్నలపై వ్యూహ రచన ● ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులపై అధ్యయనం చేస్తున్న కేసీఆర్ ● మేడిగడ్డ-సుందిళ్ల-అన్నారం లోపాలపై మాజీ సీఎం కేసీఆర్ లోతైన విశ్లేషణ

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** తొలిసారి కాళేశ్వరం కమిషన్ విచారణ కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కానున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం జూన్ 5న హాజరు కావాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో విద్యుత్ కమిషన్ విచారణకు రావాలని నోటీసులు ఇవ్వగా కేసీఆర్ వెళ్లలేదు. ప్రస్తుతం కాళేశ్వరం విచారణకు హాజరు కాకపోతే తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉన్నందున ఈ సారి విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు.


ఈ మేరకు ఆయన కాళేశ్వరం నిర్మాణం నుంచి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు డ్యామేజీ అయ్యే వరకు జరిగిన పరి ణామాలపై ఫాంహౌస్ లో స్టడీ చేస్తున్నట్టు సమాచారం.




## శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు తొలగించాలి: హైడ్రా కమిషనర్ ఆదేశాలు

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన పైనా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్మారు అని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు.




మీడియా స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చారు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారు మోడీ.. దేశంలో అభివృద్ధి తారాస్థాయికి చేరుకుంటుంది అని గుర్తు చేశారు.

# భూభారతి పేద రైతులకు చుట్టం..




●జూన్ 3-20 వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలి ●భూభారతిపై రైతులకు చుట్టం ఇవ్వాలి -కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి ●ధాన్యం కొనుగోలులో అవినీతి నిరోధక చర్యలు, కలెక్టర్లు ప్రో యాక్టివ్ కావాలి ●విత్తన నకిలీదారులపై కఠిన చర్యలు, పీడీ యాక్ట్ వర్తింపజేయాలి ● మండలాల్లో ఇసుక కూపన్లు సరఫరా, మేస్త్రీ చార్జీలు పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి ● జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలని అధికారులకు సీఎం ఆహ్వానం

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందిస్తున్నానన్నారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించాం.. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయి.. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేశారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి.. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు..

## నిరుద్యోగులకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను మా ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని, ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని




మంత్రి సీతక్క చెప్పారు. ఇందులో భాగంగా రూ.లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే మరో వైపు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు.

## సింగరేణి జాగృతి ఆవిర్భావం..

●బహుజనులకు, యువతకు ప్రాధాన్యం కార్మికుల సంక్షేమమే ధ్యేయం ●సింగరేణి 11 ఏరియాలకు కోఆర్డినేటర్ల నియామకం ●సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం బలి చేయాలనుకుంటోంది ●సీఎం రేవంత్ మోదీకి పని చేస్తున్నారా? లేబర్ కోడ్‌పై నోటి మాట లేదేంటి? రేవంత్‌పై ఫైర్ అయిన కవిత







## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్

●అవినీతిలో మాత్రం అద్భుత ప్రగతి సాధిస్తున్నది ● కమీషన్లే ఏజెండా ●సిరిసిల్ల ఘటన చిల్లర చేష్ట ●చిల్లర రాజకీయాలతో తెలంగాణ పరువు తీస్తున్నారు ●కేటీఆర్‌కు నోటీసులిచ్చి భయపెట్టాలనుకుంటున్నారా? ● ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయండి -మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. అవినీతి విషయంలోనే అద్భుత ప్రగతి సాధిస్తున్నదని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో కమీషన్లే వారి ఎజెండా అని మండిపడ్డారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలి, సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలన్న సోయి తప్ప మరొకటి లేదన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకునే విషయంలో పోటీపడుతున్నారని చెప్పారు.

## జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

●గులాబీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు ●అమరుల త్యాగాల స్మరణతో తెలంగాణ సంబరాలు జరుపుకుందాం ●రైతుబంధు నుంచి మిషన్ భగీరథ వరకు -తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శం ● తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం దేశానికే మార్గదర్శకం ● కేసీఆర్ ఆలోచనలు కేంద్రానికే దిక్సూచి -కేటీఆర్




## జూన్ 2న కవిత కొత్త పార్టీ..




●షర్మిల తరహాలో కవిత పాదయాత్రకు సిద్ధం ●కేసీఆర్ దెయ్యమా? దేవుడా? ప్రశ్నించిన ఎంపీ రఘునందన్ ●కవిత పార్టీ వెనుక కేసీఆరే ఉన్నారు: ఎంపీ రఘునందన్

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** మెదక్ ఎంపీ రఘు నందన్ రావు మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జూన్ 2న కొత్త పార్టీ పెట్టబోతోందని అన్నారు. పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. మంగళవారం తుఫ్రాన్ లో పర్యటించిన ఎంపీ రఘునందన్ రావు.. బీఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై జోస్యం చెప్పారు.

# భూభారతి పేద రైతులకు చుట్టం..

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి.. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి.. భూభారతి పేద రైతులకు చుట్టం.. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి.. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం.. క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది.. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి.. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి.. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి.. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి.. క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి.. 29, 30 తేదీల్లో జిల్లాల.. ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి.. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలి.. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి.

# సింగరేణి జాగృతి ఆవిర్భావం..

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సింగరేణి జాగృతి ఆవిర్భవించింది. మంగళవారం తన నివాసంలో సింగరేణి కార్మికులతో కవిత సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామన్నారు. బహుజనులు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం అని కవిత స్పష్టం చేశారు.సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటైందన్నారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతాం. కేసీఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని.. అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ కోసం పని చేస్తున్నాడని అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్కమాట మాట్లాడటం లేదు. అలియాస్ నేమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని కవిత డిమాండ్ చేశారు

# జూన్ 2న కవిత కొత్త పార్టీ..

మొదటి పేజీ తరువాయి

కేసీఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. తండ్రీ కూతుళ్ల మధ్యవర్తులెందుకని ఈ సందర్భంగా విమర్శించారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాన్నాయన్న కవిత.. పదేళ్లుగా దెయ్యాల మధ్య రాజకీయం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. గెలిచినప్పుడు దేవుడయ్యాడు ఇపుడుదయ్యం అయ్యాడు ఎందుకో చెప్పాలని ఈ సందర్భంగా ప్రశ్నించారు.

## శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు తొలగించాలి: హైడ్రా కమిషనర్ ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** ఫతేనగర్ వంతెన మెట్లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉదయం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన మెట్లపై నుంచి దిగుతుండగా అవి విరిగిపడి పలువురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. సోమవారం జరిగిన ఈ ఘటన నేపథ్యంలో కమిషనర్ మెట్ల మార్గాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రతి ఆదివారం సనత్‌నగర్‌లో సంత జరుగుతుందని.. ఆ సమయంలో వందలాది మంది మెట్ల మార్గాన్ని వినియోగిస్తారని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న మెట్లపై నుంచి రాకపోకలు సాగించడం సరికాదని కమిషనర్ నిర్ధారించారు. వంతెనకు ఆనుకుని ఏర్పాటు చేసిన మెట్లను పూర్తిగా తొలగించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు.

అలాగే నగరంలో శిథిలావస్థకు చేరిన నిర్మాణాల విషయంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం నిపుణులతో తనిఖీ చేయించి ప్రమాదకరంగా మారక ముందే వాటిని తొలగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కమిషనర్ ఆదేశాలతో ఫతేనగర్ వంతెనకు ఆనుకుని నిర్మించిన మెట్ల మార్గాన్ని జేసీబీతో హైడ్రా డిజాస్టర్ సిబ్బంది మెట్లను తొలగించారు. కొత్తగా అక్కడ మెట్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..

మొదటి పేజీ తరువాయి



అయితే, ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా భారత్ చేరుకుంది.. బీజేపీ, మోడీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతుందన్నారు బీజేపీ ఎంపీ లక్ష్మణ్.

ఇక, పేదరికం అనుభవించిన వ్యక్తి మోడీ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. మోడీనీ కులం పేరుతో రాహుల్ గాంధీ దూషించారు.. ఇక, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడు అని ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా తయారు చేస్తున్నారు మోడీ అని పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది రాహుల్ గాంధీ కుటుంబం.. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోడీనీ నాయకునిగా కీర్తిస్తుంటే గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని ఓబీసీ మోర్చ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

అయితే, ఆపరేషన్ సిందూర్ లాంటి దాడులతో పాకిస్తాన్ కు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా చెశారా అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో భారత ప్రజలు లేరు.. రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డారు.. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు అని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానం.. గతంలో అంజయ్యకు కూడా అవమానం జరిగింది.. ఢిల్లీకి వెళ్ళి కలవడంలో తప్పులేదు.. కానీ, ఇలా పడిగాపులు పడడం తెలంగాణ ప్రజలకు అవమానం అని పేర్కొన్నారు. ఇక, బీజేపీ వెనుక రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలు చేయదు.. ఏదైనా సరే ముందు నుంచే చేస్తుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చెప్పుకొచ్చారు.

# నిరుద్యోగులకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను మా ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని, ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని మంత్రి సీతక్క చెప్పారు. ఇందులో భాగంగా రూ.లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే మరో వైపు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగుల పాలిట రాజీవ్ యువ వికాసం ఓ వరంలా నిలుస్తోంది నిరుద్యోగులంతా ఈ స్కీమ్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో వెలుగులు నింపనుందని చెప్పారు.

# గుత్తాధిపత్యాన్ని సహించం

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కొత్త చిత్రాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, సినిమాలు హాళ్ల బంద్ ప్రకటనలు, తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలు, తాజా పరిణామాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి వివరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. టికెట్ ధరల పెంపు కావచ్చు, సినిమా హాళ్ల నిర్వహణ విషయం కావచ్చు.. ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను పకడ్బందీగా చేయాలన్నారు. త్వరలో విడుదలయ్యే తన సొంత చిత్రం హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి సంప్రదింపులు చేయాలని, ఇందులో తనమన బేధాలు పాటించవద్దని స్పష్టం చేశారు.

టికెట్ ధరలు, థియేటర్లలో పానీయాల ధరలపై దృష్టి

ప్రేక్షకులు సినిమా హాల్ వరకు రావాలంటే, టికెట్ ధర కంటే థియేటర్లలో పాప్‌కార్న్, శీతల పానీయాలు, మంచి నీళ్ల సీసాల ధరలు భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాటి ధరలు ఎంత, ఎంతకు అమ్ముతున్నారు, వాటిలో నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ కూడా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్‌లలో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలో గుత్తాధిపత్యం నడుస్తోందని ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుందని, ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. థియేటర్లలో తాగునీటి ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ అనేవి యజమానుల కనీస బాధ్యతలని, వాటిని పాటించేలా స్థానిక సంస్థలు చూసుకోవాలని పేర్కొన్నారు.

తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, ఆ నలుగురు' ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనుక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు.

ఈ ప్రకటన వెనుక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని పవన్ కళ్యాణ్, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనుకగల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన తరఫువాళ్ళు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని స్పష్టంగా చెప్పారు.

నిర్మాతలను కావచ్చు, నటులను కావచ్చు, దర్శకులను కావచ్చు%ొ% బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందని విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకురాదలచిన కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్‌మెంట్ పాలసీలో సినిమా రంగం అభివృద్ధికి సూచనలను కూడా తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి స్వీకరించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్



**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. అవినీతి విషయంలోనే అద్భుత ప్రగతి సాధిస్తున్నదని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో కమీషన్లే వారి ఎజెండా అని మండిపడ్డారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలి, సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలన్న సోయి తప్ప మరొకటి లేదన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకునే విషయంలో పోటీపడుతున్నారని చెప్పారు. సూర్యాటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు మరోసారి నోటీసులు, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఖండించారు.

ప్రశ్నిస్తున్న వాళ్లకు నోటీసులు ఇప్పించి బయపెట్టాలని చూస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్‌లో రేవంత్ పేరును ఈడీ పేర్కొన్నప్పటికీ.. మోదీని కలవడానికి వెళ్లాడంటేనే ఆయన బుద్ధి అర్థమవుతుంది. దీనినిబట్టి రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ దోస్తీ ఎట్లుందో తెలుస్తుంది. రేవంత్ చిల్లర చేష్టలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడు. అందాల పోటీలతో ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీసిండు. కేటీఆర్‌కు నోటీసులిస్తే బయపడతామనుకుంటున్నారా?. ఆ నాడు కేటీఆర్ స్వయంగా 8 గంటలు కూర్చుని చెప్పిన విషయం మీకు గుర్తుకులేదా.

ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుందని రేవంత్ ఏడుస్తున్నది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఇతర దేశాల ఆహ్వానం మేరకు వెళ్తున్నాడని తట్టుకోలేక పోతున్నారు. వాటికీ హాజరుకాకుండా ఆపాలనే అక్కసుతోనే నోటీసులు ఇచ్చారు. నోటీసులతో చిల్లర డ్రామాలు చేస్తూ మరింత నవ్వుల పాలవుతున్నారు. చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయలేరు. 18 నెలలైనా ఇంకా బీఆర్ఎస్ మీద ఏడుపు తగ్గలేదు. కేసీఆర్ కాళేశ్వరం ఎందుకు కట్టిండో కాంగ్రెస్‌కు అవగాహన లేదు. మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదు. చిల్లర చేష్టలు మానుకొని ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిది.

సిరిసిల్ల ఘటన చిల్లర చేష్ట..

ప్రోటోకాల్ చూడాల్సిన బాధ్యత ఆఫీసర్ల పని. కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ చిల్లర మూకలకు ఏంపని. కేటీఆర్ క్రేజ్ ఖండాతరాలకు వ్యాపించింది. ఆ ఏడుపుతోనే తమ నాయకుడిపై చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పనికిమాలిన చర్యలతో మరింత అభాసుపాలవుతున్నది. రేవంత్ బాసులనే తరిమికొట్టి తెలంగాణ తెచ్చినోళ్ళం. ఆయన చిల్లర చేష్టలకు భయపడతామా. తస్మాత్ జాగ్రత్త.. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయండి' అని కాంగ్రెస్ నాయకులను జగదీశ్ రెడ్డి హెచ్చరించారు.

# కాళేశ్వరం విచారణకు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే విచారణకు వెళ్లొచ్చిన రిటైర్డ్ ఇంజినీర్లతో వరుసగా భేటీ అవుతున్నా రు.

లోపాలు ఎక్కడ జరిగాయి.. ఎన్డీఎస్ఏ ఏం చెప్పింది.. విజిలెన్స్ రిపోర్టులో ఏమున్నాయి..? నిర్మాణ సంస్థలు ఎలాంటి సమాచారం ఇచ్చాయి. డిజైన్ లోపాలున్నాయా..? నిర్మాణ సమస్యలా..? ఎందుకలా జరిగింది..? అనే అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్టు సమాచారం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న, నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టులపైనా ఆరా తీస్తున్నారని సమాచారం.

ఇదే తరుణంలో ఇప్పటికే విచా రణకు హాజరైన వారితోనూ మాట్లాడుతున్నా రని తెలుస్తోంది. కమిషన్ ఎలాంటి ప్రశ్నలు అడుగుతోంది.? ఆఫిడవిట్ ఏమని ఇచ్చారని వాకబు చేస్తున్నట్టు తెలుస్తోంది. అప్పట్లో నీటి పారుదలశాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావుతోనూ కేసీఆర్ భేటీ అయ్యారు. కమిషన్ నోటీసులు జారీ చేసిన తర్వాత రెండు సార్లు వీ ళ్లిద్దరూ ఎర్రవల్లి ఫాంహౌస్ భేటీ అయ్యారు.

కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందుకున్న కేసీఆర్ జూన్ 5న జరిగే విచారణకు హాజరు కానున్నారు. విచారణకు వెళ్లే సమయంలో వెన్నంటి ఉండేందుకే కేటీఆర్ ముందస్తుగా అమెరికా వెళ్లారని తెలుస్తోంది. మంగళవారం లండన్, అమెరికా పర్యటనకు వెళ్లిన కేటీఆర్ జూన్ 3వ తేదీన తిరిగి వస్తారని సమాచారం.

# అలాగైతే రాజీనామా చేస్తా .. మంత్రి లోకేష్ సంచలన సవాల్

మొదటి పేజీ తరువాయి

జగన్ తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. లిక్కర్ కేసులో దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందన్నారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి మంత్రి నారా లోకేష్ సంచలన సవాల్ విసిరారు.ఊర్సా క్లస్టర్స్‌కి 99 పైసలకి ఎకరా భూమి ఇచ్చినట్లు వైఎస్ జగన్ నిరూపిస్తే.. రాజీనామా చేస్తా. జగన్‌కు ఇదే నా సవాల్ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. మార్కెట్ రేటు ప్రకారమే ఊర్సాకు భూములు ఇచ్చాం అని నారా లోకేష్ చెప్పుకొచ్చారు.

# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో జూన్ రెండవ తేదీన పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదన చారి పాల్గొని జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.అలాగే తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జాతీయ జెండా తోపాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబరాలు జరపాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గాలు , మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాలలో జాతీయ పతాకంతోపాటు గులాబీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని అన్నారు.అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు , విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారం అయిందని కేటీఆర్ గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సర్కార్ కు కూడా దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతుబంధు , మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారిచూపే దీపస్తంభంలా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# భారత్ తో శాంతి చర్చలకు రెడీ..



**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** పాకిస్తాన్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది.. పహల్గాంలో ఉగ్రమూకలు దాడి తరువాత .. భారత్ ప్రతి చర్యకు పాక్‌కు దిమ్మదిరిగి మైండ్ బ్లాంక్ అయింది. ఇంతకాలం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన దాయాది దేశాధినేతలు... దిగి వచ్చారు. విదేశాల్లో పర్యటిస్తున్న పాక్ ప్రధాని భారత్ తో శాంతి చర్చలు జరిపేందుకు సిద్దంగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఇరాన్ లో పర్యటిస్తున్న పాక్ ప్రధాని షరీఫ్.. మాట్లాడుతూ.. భారత్ తో తాము శాంతి ఒప్పందాలు చేసుకునేందుకు సిద్దంగా ఉన్నమని ప్రకటించారు. ఉగ్రవాద సమస్య.. జమ్మూకాశ్మీర్.. సింధూ జలాల వివాదాలను పరిష్కరించుకునేందుకు చర్చించేందుకు రడీ గా ఉన్నామని ప్రకటించారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తేల్చి చెప్పారు. ఇండియాతో తాము ఎప్పుడూ శాంతి కోసమేప్రయత్నాలు చేస్తున్నామని పాక్ ప్రధాని చెప్పుకొచ్చారు. భారత్ కూడా అదే కోరుకుంటే బావుంటుందని షరీఫ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌తో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) విషయంలో తప్ప ఏ విషయంలోనూ చర్చలు ఉండబోవని భారత్ తేల్చి చెప్పింది. .. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే పూర్తిగా ద్వైపాక్షికంగా ఉంటాయని.. ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే ఉంటుందని ఇప్పటికే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ కూడా సోమవారం గుజరాత్‌లో పర్యటిస్తూ.. పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాకిస్థాన్ పౌరులు.. ప్రభుత్వ పెద్దలు శాంతిని కోరుకోకపోతే.. ఉగ్రవాదులను భారత్‌పైకి ఉసిగల్పితే.. ఇండియన్ ఆర్మీ తమ సత్తా ఏంటో చూపుతుందని చెప్పుకొచ్చారు. ప్రశాంతంగా జీవిస్తూ రోటీలు తినండి.. లేకపోతే బుల్లెట్ దిగుతుందని హెచ్చరించారు. అరకొరగా ఉన్న భారత్ .. పాకిస్తాన్ మధ్య సంబంధాలు పహల్గాం అటాక్ తరువాత పూర్తిగా దెబ్బతిన్నాయి. పాక్ పెంచి పోషిస్తున్న ఉగ్రమూకల శిబిరాలను భారత్ సింధూర్ పేరుతో ఇండియన్ ఆర్మీ చిత్తు చిత్తు చేసింది. తరువాత పాక్ రెచ్చిపోయి చేసిన దాడులను భారత్ ఎక్కడికక్కడ తిప్పికొట్టింది. పాక్‌ఆర్మీ.. ఎయిర్ బేస్ లను నాశనం చేసిన భారత ఆర్మీ.. దాయాది దేశానికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించిన పాక్ ప్రభుత్వ పెద్దలు కాళ్లబేరానికి వచ్చి.. భారత్ తో శాంతి చర్చలు జరిపేందుకు సిద్దంగాఉన్నమని ప్రకటించారు. మరి ఈ విషయంలో ఎంత వరకు పాక్ తన మాటకు కట్టుబడి ఉంటుందో చూడాలి.

# ఏపీకి ఒకరు, తెలంగాణకు ముగ్గురు హైకోర్టు జడ్జిల బదిలీ



**న్యూస్ డెస్క్, 27 మే (కెరటం న్యూస్):** 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం పేర్కొంది.

# చింతకాని-ముదిగొండ రైతులకు శుభవార్త

## నూతన మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం



**చింతకాని, 27 మే (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా చింతకాని మరియు ముదిగొండ మండలాలకు సేవలందించే విధంగా నూతన మార్కెట్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. మాత్కేపల్లి గ్రామ పరిధిలోని 41వ సర్వే నెంబరు గల భూమిలో నూతన మార్కెట్ ఏర్పాటుకు మార్కెటింగ్ మరియు రెవెన్యూ శాఖల సంయుక్తంగా సర్వే చేపట్టడం జరిగింది. ఈ సర్వేను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు జిల్లా మార్కెట్ అధికారి ఎం.ఏ. అలీం , మార్కెట్ సహాయ కార్యదర్శి వీరాంజనేయులు , రెవెన్యూ సర్వేయర్ నవీన్ సంయుక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, మాజీ ఖమ్మం మార్కెట్ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ , మండల కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున గ్రామ రైతులు తదితరులు పాల్గొని భూసమీకరణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ మార్కెట్ నిర్మాణం ద్వారా స్థానిక రైతులకు సాగు ఉత్పత్తులకు సరైన ధరలు లభించడమే కాకుండా, మార్కెట్ వసతులు మెరుగుపడి, ఆర్థికంగా మేలు జరుగనుంది. ఇది ప్రాంతీయ అభివృద్ధి దిశగా ముఖ్యమైన ముందడుగుగా పరిగణించవచ్చు.



# ఊరి బడిని కాపాడుకుందాం

## జిల్లా జేపసీ అధ్యక్షులు గుంటుపల్లి



**ఖమ్మం ఎడ్యుకేషన్, 27 మే (కెరటం న్యూస్):** ఊరిలో ఉన్న ప్రభుత్వ బడిని కాపాడుకుందామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఖమ్మం నియోజకవర్గ ప్రచార జాతాను మంగళవారం నాడు ఖమ్మం జిల్లా జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ యుటిఎఫ్ మంచి కార్యక్రమం చేపట్టిందని అభినందించారు. తల్లిదండ్రులందరూ విజ్ఞతతో ఆలోచించి సకల సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ బడులలో మీ పిల్లలను చేర్పించి మంచి విద్య పొందాలని కోరారు. ఊరి బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులదేనని తెలియజేశారు. జాతా ద్వారా ఎన్టీఆర్ సర్కిల్, ఖానాపురం, పాండురంగాపురం, బల్లేపల్లి, బాలపేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వెంకన్న, షమి, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్, నరసింహారావు, శ్రీనివాసరావు, సంతులాల్, మంగీలాల్, రమణ, శ్రీనివాస్, రాంబాబు, రవికుమార్, సుధాకర్, రంగారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో మంచి నేతను కోల్పోయాం

## బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

## మదన్‌లాల్ మృతదేహం వద్ద బిజెపి నేతల నివాళి



**ఖమ్మం టౌన్, 27 మే (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో గిరిజన వర్గానికి చెందిన మంచి నేతను కోల్పోయామని బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్‌లాల్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందిన విషయం తెలియగానే పార్టీ శ్రేణులతో కలిసి నెల్లూరి కోటేశ్వరరావు ఖమ్మం నగరంలోని కోర్టు ఎదురుగా ఉన్న మదన్‌లాల్ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు కుంగిపోకుండా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేసేలా శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు వెల్లడిరచారు. మదన్‌లాల్ మృతదేహానికి ఈ సందర్భంగా కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మందడపు సుబ్బారావు, నున్నా రవి కుమార్, జ్వాలా నర్సింహారావు, అల్లిక అంజయ్య, రవి రాథోడ్, కుమిలి శ్రీనివాస్, కందుల శ్రీక్రిష్ణ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

### మదన్‌లాల్ మృతికి సుధాకర్‌రెడ్డి సంతాపం

వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతి పట్ల బిజెపి జాతీయ నాయకులు, మాజీ శాసనమండలి సభ్యులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమం కోసం రాజకీయాల్లోకొచ్చిన మదన్‌లాల్ వైరా శాసనసభ్యునిగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# మృతదేహాలకు భయపడుతున్న పాలకులు

## సుప్రీం కోర్ట్ సుమోటో గా స్వికరించాలి

## ఘటన కు సంబంధించి భాద్యుల పై కేసు నమోదు చేయాలి

## మీడియా సమావేశం లో వామ పక్ష హక్కుల సంఘాల నేతలు




**ఖమ్మం టౌన్, 27 మే (కెరటం న్యూస్):** మావోయిస్టు మృత దేహాలను చూసి పాలకులు బయపడుతున్నారని అందుకే నంభాల కేశవరావు సహా ఎనిమిది మంది మృత దేహాలను అప్పగించలేదని వామ పక్ష ప్రజా హక్కుల సంఘాల నేతలు ఆరోపించారు శత్రు దేశాల సైనికులు యుద్ధం లో మరణిస్తే మృతదేహాలను స్వ దేశానికి అప్పగిస్తారని కానీ మావోయిస్టు మృతదేహాలను అప్పగించకుండా ప్రభుత్వం కిరాతకంగా వ్యవరించిందని తెలిపారు మంగళవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వామ పక్ష ప్రజా హక్కుల సంఘాల నేతలు మాట్లాడుతూ చత్తీస్గడ్ ప్రభుత్వం న్యాయస్థానానికి ఇచ్చిన హామీని సైతం నిలబెట్టుకోలేదని వారు ఆరోపించారు సజీవంగా పట్టుకొని అతి దగ్గర నుంచి కాల్చి చంపారని అందుకే మృత దేహాలను అప్పగించలేదని వారు తెలిపారు దశాబ్దాల పాటు ప్రజల పక్షాన పోరాడిన వారి మృతదేహాల ముందు తప్ప తాగి నాట్యం చేస్తారని ఇదెక్కడి మానవత్వం అని ప్రశ్నించారు కేంద్ర హెూం మంత్రి చత్తీస్గడ్ హెూంమంత్రి నారాయణపూర్ ఎస్పి పై కెసులు నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా శిక్షించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ని పాలకులే ఉల్లంఘిస్తున్నారని వారు తెలిపారు ఒక సైనిక అధికారి ఫోన్ చేస్తే రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని స్వదేశంలో ప్రజల కోసం పోరాడుతున్న వారు శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు స్పందించరని వారు ప్రశ్నించారు. ఆదివాసీల మనుగడపైన సుప్రీంకోర్టు స్పందించాలని ఆపరేషన్ కగారును నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు మీడియా సమావేశంలో శాంతి సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ ఎం ఎఫ్ గోపీనాథ్ సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ప్రజా పందా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ యన్ డీ నాయకులు లక్ష్మి నారాయణ సిపిఎ బాధ్యులు కాకి భాస్కర్ ఐవి రమణారావు రవి మారుత్ విజయ్ చిత్రా రవి వివిధ పక్షాల నేతలు ఎస్కె జానీ మియా ఎర్ర బాబు కే గోవిందరావుమాదినేని రమేష్ వై విక్రమ్ జాన్సీ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సత్యవతికి ఎంపీ వద్దిరాజు పరామర్శ



**హైదరాబాద్ బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను పరామర్శించారు. ఆమె సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలియడంతో ఎంపీ రవిచంద్ర మంగళవారం వెళ్లి పరామర్శించారు. ఎంపీ వద్దిరాజు మాజీ ఎంపీ సత్యవతి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని,త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మంచి ఆత్మీయుడిని కోల్పోయాను

## మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ మృతి పై ఎంపీ వద్దిరాజు



**హైదరాబాద్ బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** వైరా మాజీ శాసనసభ్యుడు బానోత్ మదన్ లాల్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఆస్పత్రిలో చేరి ఈ ఉదయం మరణించినట్లు తెలిసి ఎంపీ రవిచంద్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు, నమ్మలేకపోయారు.మదన్ లాల్ తనకు సన్నిహితుడని, బీఆర్ఎస్ నాయకుడిగా, ఎమ్మెల్యే గా వైరా నియోజకవర్గానికి,ప్రజలకు విశేష సేవలందించారని, అకాల మృత్యువుకు లోనవ్వడం తీవ్ర బాధాకరమని ఎంపీ రవిచంద్ర తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతితో బీఆర్ఎస్, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, వైరా నియోజకవర్గ ప్రజలు నిబద్ధత కలిగిన నాయకుడని కోల్పోయారని, తీరని లోటని ఎంపీ రవిచంద్ర అన్నారు. ఆయన మృతి మదన్ లాల్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# తీర్ధ యాత్రలకు రైల్వే శాఖ ఏర్పాట్లు




**ఖమ్మం టౌన్, 27 మే (కెరటం న్యూస్):** తీర్ధ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రంలో ని ప్రజల కోసం జూన్ 14 వ తేదీ నుండి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు IRCTC టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ DSGP కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకి సంబందించిన వివరాలు వెల్లడించారు. ప్యాకేజీ 1: (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర–SCZBG44)

ఈ యాత్రలో (కాశీ)వారణాసి / అయోధ్య / నైమిశారణ్య / ప్రయాగరాజ్ / శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16200, 3 ఏసీ ధర 26500, 2 ఏసీ ధర 35000 ఉంటుంది. . ఈ యాత్ర సికింద్రాబాద్ ,భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్,భువనేశ్వర్.మీదుగా వెళ్తుంది.

ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర – SCZBG43): ఉజ్జయిని (మహాకాళేశ్వర్ – ఓంకారేశ్వర్) – త్రయంబకేశ్వర్ – భీమశంకర్ – ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్ / ఓంకారేశ్వర్ / త్రయంబకేశ్వర్ / భీంశంకర్ / ఘృష్ణేశ్వర్ / ఎల్లోరా / మోవ్/ నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 05 వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14700, 3 ఏసీ ధర 22900, 2 ఏసీ ధర 29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది.

సౌకర్యాలు: రైలు, బస్సు, హెూటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం మరియు రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలు లో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 లకు సంప్రదించాలని మరిన్ని వివరణలకు www.irctctourism.com వెబ్సైట్ ని సంప్రధించాలని తేలిపారు.

# బాణోత్ మదన్ లాల్ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది

## మదన్ లాల్ మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు

## మదన్ లాల్ భౌతిక కాయానికి నివాళ్లు అర్పించిన మాజీ ఎంపీ నామ, మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ఖమ్మం బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణోత్ మదన్‌లాల్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం నాడు ఖమ్మం నగరం లోని కవిరాజ్ నగర్ నందు ఉన్న మదన్ లాల్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలసి పూల మాల వేసి ఘనంగా నివాళు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా తో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పై పోరాటం చేసిన నాయకుడు మదన్ లాల్ అన్నారు. గెలిచిన, ఓడిన ప్రజల పక్షాన నిలబడ్డారని పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆయన పనితీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మదన్‌లాల్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తుంచేసుకుంటూ ఆయన నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని నామ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గా వైరా నియోజకవర్గంలో మదన్‌లాల్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన ఎప్పుడు ప్రజల మధ్య ఉండే నాయకుడిగా పేరుగాంచారని, ఎల్లప్పుడూ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేవారని తెలిపారు. నియోజకవర్గంలో సామాజిక న్యాయం కోసం ఎంతో పోరాడిన మదన్‌లాల్, గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. చివరి దాకా పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నారని నామ తెలిపారు. మదన్ లాల్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని నామ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామ వెంట బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులు ఉన్నారు.

## మదన్ లాల్ మృతికి పోట్ల శ్రీనివాసరావు దిగ్భ్రాంతి



**కొణిజర్ల, 27 మే (కెరటం న్యూస్):** వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ గారు హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్ లో గుండెపోటుతో మరణించడం పట్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోట్ల శ్రీనివాసరావు గారు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. వైరా నియోజకవర్గం శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించి నియోజకవర్గ అభివృద్ధికి, కొణిజర్ల మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు, ఆయన మరణం జిల్లా, వైరా నియోజకవర్గ కొణిజర్ల మండల ప్రజలకు తీరని లోటు అన్నారు, మదన్ లాల్ గారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, దేవుడు వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.



## మదన్ లాల్ కు ఎంపీ సహా పలువురి నివాళులు



**ఖమ్మం బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ లోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన మదన్ లాల్ భౌతిక కాయాన్ని ఖమ్మం కవిరాజ్ నగర్ రోడ్డు నంబర్ 16లో ఉన్న ఆయన నివాసానికి తరలించారు. విషాదవార్త తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్ కుమార్ లు హైదరాబాద్ నుంచి బయలుదేరి ఖమ్మం చేరుకున్నారు. స్వర్గీయ మదన్ లాల్ పార్థివదేహాన్ని ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ (ఆర్జేసీ) తదితర ప్రముఖులు సందర్శించి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దివంగత నాయకుడు మదన్ లాల్ సతీమణి మంజుల, సోదరులు సుందర్ లాల్, మంగీలాల్, కుమారుడు మృగేందర్ లాల్, కూతురు మనీషా లక్ష్మీలను ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ తదితర ప్రముఖులు ఓదార్చి, పరామర్శించారు, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అకాల మరణం గురించి తెలిసిన బంధుమిత్రులు, బీఆర్ఎస్ శ్రేణులు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మదన్ లాల్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

## మదన్ లాల్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ పరామర్శ

### ధైర్యంగా ఉండాలని కుమారుడు మృగేందర్ లాల్ కు ఓదార్పు



**ఖమ్మం బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** హఠాన్మరణం పాలైన మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ పరామర్శించారు. ఆయన కుమారుడు ఐఏఎస్ హెూదాలో కోయంబత్తూరు జీఎస్టీ జాయింట్ కమిషనర్ గా పని చేస్తున్న మృగేందర్ లాల్ ను ఫోన్లో ఓదార్చారు. సంఘటన జరిగిన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. మదన్ లాల్ ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచి వేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. శోక సంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ ఫోన్లో ఓదార్పునిచ్చారు.

## ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కు డాక్టరేట్



**ఖమ్మం, 27 మే (కెరటం న్యూస్):** ఎస్.ఆర్ అండ్ బి. జి .ఎన్. ఆర్. ప్రభుత్వ కళాశాల (అటానమస్) ఖమ్మం కళాశాల ఫిజిక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే కిరణ్ కుమార్ కు ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు అయినట్లు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగం అధికారి ప్రొఫెసర్ శశికాంత్ తెలియజేశారు. భౌతిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కే సాధన పర్యవేక్షణలో స్ట్రక్చరల్ ఆప్టికల్ స్పెక్ట్రోస్కోపిక్ ప్రాపర్టీస్ ఆఫ్ డోపెడ్ జింక్ అల్యూ మీనెట్ ఫర్ ఎలక్ట్రో కెమికల్ అప్లికేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అవార్డు అయినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ అయిన ప్రొఫెసర్ ఎం. ప్రసాద్, డిపార్ట్మెంట్ అధ్యాపకులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ జకీరుల్లా, కళాశాల భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ బి అనిత డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ బి శ్రీనివాస్, సూరంపల్లి రాంబాబు, రాజశేఖర్, ధర్మయ్య , వైస్ ప్రిన్సిపాల్ సైన్సెస్ డాక్టర్. బానోత్ రెడ్డి, కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ బి శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలియజేసినారు. అధునాతన సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్ ల తయారీలో తన పరిశోధన ఉపయోగ పడుతుంది అని తెలియ చేశారు.

## భూభారతి చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం కలెక్టరేట్, 27 మే (కెరటం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక టిటిడిసి భవనంలో సర్వే, ల్యాండ్ రికార్డు శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. భూ భారతి చట్టం, భూ సమస్యలపై సమగ్ర అవగాహన, భూ మ్యాప్, నక్షా, భూ హద్దులు తదితర విషయాలపై స్పష్టంగా సర్వేయర్ల అవసరమని వారి విధుల పై అవగాహన కల్పిస్తు కలెక్టర్ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో లైసెన్స్ సర్వేయర్లు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి లైసెన్సులను జారీ చేయనుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి శిక్షణ కోసం ఎంపిక చేశామని అన్నారు. 50 రోజుల పాటు వీరికి భూముల సర్వేలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

భూభారతి చట్టంలో పొందుపర్చిన సెక్షన్ ల ప్రకారం భూముల క్రయవిక్రయాలు, సక్సేషన్ వంటి వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో భూముల సర్వే జరిపి మ్యాప్ లను రూపొందించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వ్యవసాయ భూములకు కూడా సర్వే మ్యాప్ లను జతచేయాలని భూభారతి చట్టంలో పొందుపర్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు లైసెన్సుడ్ సర్వేయర్లు సర్వే జరిపి భూముల హద్దులు, సమగ్ర వివరాలతో సర్వే మ్యాప్ లను సమర్పిస్తే, వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన మీదట పట్టా పాస్ బుక్ కు జతచేయడం జరుగుతుందని తెలిపారు.



పట్టా పాస్ బుక్ లు కలిగిన రైతులు ఎవరైనా సరే సర్వే మ్యాప్ కోసం దరఖాస్తు చేసుకుని, లైసెన్సుడ్ సర్వేయర్లచే సర్వే చేయించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతి భూమి పార్సిల్ కు ఆధార్ తరహాలో భూధార్ నెంబర్ ను కేటాయించనుందని, దీని కోసం కూడా లైసెన్సుడ్ సర్వేయర్ల సేవలు అవసరం అవుతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ సందర్భంగా నేర్పించే అంశాలను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు, భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై థియరీ క్లాసులతో పాటు క్షేత్రస్థాయిలో చెయిన్ సర్వే, మ్యాప్ రీడింగ్ వంటి వాటి గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ సంబంధిత సమస్యలలో అత్యధికంగా సర్వేతో ముడిపడిన అంశాలే ఎక్కువగా ఉన్నందున లైసెన్సుడ్ సర్వేయర్లు చక్కగా సేవలందిస్తే, అనేక భూ సమస్యల దరఖాస్తులు పరిష్కారం అవుతాయని, తద్వారా భూ వివాదాలకు తావు లేకుండా చేయాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని అన్నారు. సర్వేయర్ల శిక్షణలో ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంశయానికి లోను కాకుండా వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. 50 రోజుల పని దినాలలో కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో పాటు తాను కూడా ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తానని అన్నారు. భూభారతి చట్టం గురించి అవగాహన ఏర్పర్చుకుని, భూముల సర్వే విధానాన్ని సమగ్రంగా నేర్చుకుంటే లైసెన్సుడ్ సర్వేయర్ గా చక్కటి ఆదాయ వనరులను పొందవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అయిన లైసెన్సుడ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా భూములు లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి హద్దులను నక్షాల్లో పొందుపరిచిన తరువాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని దీనివల్ల తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగులు ఈ ట్రైనింగ్ పూర్తి చేసి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం నూతన సర్వేయర్లకు శిక్షణ మెటీరియల్ ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా మట్టపర్తి రమేష్

### ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ గా ఎన్నిక



**కొత్తగూడెం, 27 మే (కెరటం న్యూస్):** ఈనెల 26న స్టేట్ ఒలంపిక్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్టేట్ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లారెడ్డి సమక్షంలో తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్ అశోక్ హైదరాబాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రతాప్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మట్టపర్తి రమేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెక్రెటరీగా ధనుంజయ్ గౌడ్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్, ట్రెజరర్ గా కే కృష్ణని ఎన్నుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ గా మట్టపర్తి రమేష్ ను ఎన్నుకోవడం జరిగినది. మట్టపర్తి రమేష్ ఎన్నికవడం పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కార్యదర్శులు పుట్ట శంకరయ్య, క్రిస్టోఫర్ బాబు, క్రీడా సంఘాలు మరియు పుర ప్రముఖులు అభినందనలు తెలియజేసారు.



## విధులకు గైరహాజరవుతున్న కార్మికులకు కౌన్సిలింగ్




**కొత్తగూడెం, 27 మే (కెరటం న్యూస్):** కొత్తగూడెం ఏరియాలోని జెవిఆర్ సి.హెచ్.పి నందు ఉదయం 10.30 గంటల కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆదేశానుసారం 2025 సంవత్సరంలో జనవరి నుండి మే నెల వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరు హాజరవుతున్న ఉద్యోగులకు విధులకు హాజరవ్వాలని కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ విధులకు గైర్హాజరు అవుతూ ఈ సంవత్సరం 2025లో జనవరి నుండి మే నెల వరకు 60 మాస్టర్లు, అంతకన్నా తక్కువ మాస్టర్లు చేసిన ఉద్యోగులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గైర్హాజరు కాకుండా విధులకు హాజరయ్యేలా వారిని ప్రోత్సహించడానికి ఈ కౌన్సిలింగ్ కు పిలవడం జరిగిందని అన్నారు. ఈ కౌన్సిలింగ్ కు హాజరైన ప్రతి ఉద్యోగి గైర్హాజరు అవుటకు గల కారణాలను జిఎం అడిగి తెలుసుకున్నారు. అలాగే మెడికల్ కారణంగా విధులకు హాజరుకాని ఉద్యోగులను సంబంధిత అధికారులతో వారి ఆరోగ్య స్థితిగతులను మెడికల్ డిపార్ట్మెంట్ వారితో రివ్యూ చేయించాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ కు సంబంధిత అధికారులు, మెడికల్ సూపర్డెంట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, గైర్హాజరుకు కారణాలు అడిగి తెలుసుకొని, గైర్హాజరు వలన వారికి, వారి కుటుంబాలకు, మరియు సంస్థకు కలిగే నష్టాలను వివరించి రోజువారీగా విధులకు హాజరవ్వాలని తెలియజేశారు. అలాగే జెవిఆర్ సి.హెచ్.పి సంక్షేమ అధికారి దారా కావ్య కు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు ప్రతి వారం వారి హాజరులను తీసి, వారిని విధులకు హాజరయ్యేలా మోనిటరింగ్ చేస్తూ కౌన్సిలింగ్ చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. నెల రోజుల తర్వాత వారి హాజరు వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, డిజిఎం (పర్సనల్) బి శివ కేశవరావు, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్. నరసింహారావు, జెవిఆర్ సి.హెచ్.పి డిజిఎం కే. సోమశేఖర్, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ ప్రసాద్, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ నాగేశ్వరరావు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మదన్ లాల్ అకాల మరణం

### తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ తాత మధు


**ఖమ్మం బ్యూరో, 27 మే (కెరటం న్యూస్):** వైరా మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ మదన్ లాల్ అకాల మరణం ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. శ్రీ మదన్ లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని మరియు వారి కుటుంబ సభ్యులకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



## నిధులు లేక..గ్రామాల్లో నిలిచిన పనులు

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు

**మొగుళ్లపల్లి, 27 మే (కెరటం న్యూస్):** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కళకళలాడిన గ్రామపంచాయతీలు..ప్రస్తుతం పట్టించుకునే నాథులు లేక అస్తవ్యస్తంగా మారుతున్నాయని బీఆర్ఎస్ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు ఆరోపించారు. మంగళవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలక వర్గాలు లేక పాలన పడకేసిందన్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువై గ్రామాలు సమస్యల్లో చిక్కుకొని కొట్టుమిట్టులాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.




కాంగ్రెస్ సర్కార్ ఏడాదిన్నరగా నిధులు ఇవ్వకపోవడంతో..నిర్వహణ భారం మోయలేక పంచాయతీ కార్యదర్శులు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఈ కాంగ్రెస్ పాలనలో దాపురించాయన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ట్రాక్టర్, ట్యాంకర్ ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ట్రాక్టర్లను కొనుగోలు చేయించిందని, పారిశుద్ధ్య నిర్వహణకు, ఇతర పనులకు వాహనం తప్పనిసరి కావడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులకు తప్పడం లేదన్నారు. రుణం పై వాహనాలను కొనుగోలు చేయడంతో..ప్రతి మూడు నెలలకోసారి వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో డీజిల్ కు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సిబ్బంది తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిధులు రాకపోవడం..వసూలు చేసిన పన్నులు సరిపోకపోవడంతో పారిశుద్ధ్య, మంచినీటి నిర్వహణ, ట్రాక్టర్ ఇతర వాటికోసం తప్పనిసరిగా తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టి పనులు చేయించాల్సి వస్తుందని పలువురు పంచాయతీ కార్యదర్శులు తనతో వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నిధులు వచ్చిన తర్వాత తీసుకోవచ్చన్న ఉద్దేశంతో పలుచోట్ల లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్తున్నారని, ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టడంతో..బదిలీ అయిన అనంతరం ఖర్చు చేసిన డబ్బులను ఎలా తీసుకోవాలన్న ఆందోళన కార్యదర్శుల్లో నెలకొందన్నారు.